పాఠశాల నుంచి ఆ ముగ్గురు మిత్రులు. ఇంటర్‌లో వేర్వేరు కాలేజీల్లో చేరినా సెలవు రోజుల్లో మాత్రం ఆ ముగ్గురూ కలిసి సరదాగా గడిపేవారు. అయితే, వీరి స్నేహాన్ని చూసి మృత్యువుకు కన్నుకుట్టిందో ఏమోగానీ ముగ్గురినీ అలల రూపంలో వచ్చి కబళించింది. ఇందుకూరుపేట మండలం మైపాడ్ బీచ్‌లో ఆదివారం మధ్యాహ్నం కడలిలో ఈతకు దిగిన ముగ్గురు ఇంటర్ విద్యార్థులు గల్లంతు అయి, విగతజీవులుగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, స్నేహితులు జీజీహెచ్‌లోని మార్చురీ వద్దకు చేరుకుని గుండెలవిసేలా విలపించారు.



అంబులెన్స్‌లో ఉన్న మృతదేహాలను చూస్తున్న బంధువులు, స్నేహితులు



ఇందుకూరుపేట: మైపాడు తీరంలో యువకుల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

కన్నపేగులో అలజడి!

- మైపాడు బీచ్‌లో ముగ్గురు స్నేహితుల గల్లంతు
- కొద్దిసేపటికే మృతదేహాల వెలికితీత
- ముగ్గురూ ఇంటర్ విద్యార్థులే!
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

ఇందుకూరుపేట/నెల్లూరు(క్రైం)/నెల్లూరు రూరల్ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరులోని జెండావీధికి చెందిన పఠాన్ రహమత్, షమీల కుటుంబం ఆరు మాసాల క్రితం షమీల సొంతూరైన నెల్లూరురూరల్‌లోని నారాయణరెడ్డిపేటకు వచ్చారు. అద్దె ఇంట్లో ఉంటున్న రహమత్ నెల్లూరులోని ఓ బంగారు దుకాణంలో పనులు చేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు కాగా, పెద్దకుమారుడు పఠాన్ తాజీమ్ (17) అరవిందనగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అలాగే, కోటమిట్ట ప్రాంతంలో నాయబ్‌రసూల్, మున్నీ దంపతుల కుమారుడు పఠాన్ హుమయూన్ (17) కూడా నారాయణ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నారు.

- కోటమిట్ట ప్రాంతానికి చెందిన బాబు, జబీన్ దంపతుల కుమారుడు సమీద్ (17). సమీద్ తండ్రి చిన్నతనంలోనే మృతి చెందడంతో తల్లి జబీన్ ఎంతో కష్టపడి తన ఇద్దరు కుమారులను పెంచింది. ఈ క్రమంలో సమీద్ నగరంలోని కృష్ణచైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ ముగ్గురు నగరంలోని కోటమిట్టలో ఉన్న సిటీజన్ పాఠశాలలో 8 నుంచి పదవ తరగతి వరకు కలిసి చదువుకున్నారు.

● అలలధాటికి గల్లంతు

ఆదివారం సెలవు రోజు కావడంతో మధ్యాహ్నం ముగ్గురూ మైపాడు బీచ్‌కు వెళ్లారు. అక్కడ నీటిలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా అలలధాటికి గల్లంతు అయ్యారు. అక్కడే ఉన్న వారు కేకలు వేయడంతో మెరైన్ పోలీసులు రంగంలోకి దిగి గాలించారు. 3 గంటల ప్రాంతంలో ఆ ముగ్గురి మృతదేహాలను వెలికి తీశారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



సమీద్ | తాజీమ్ | హుమయూన్

ఇప్పుడే వస్తామని చెప్పి..

పఠాన్ తాజీమ్, పఠాన్ హుమయూన్, సమీద్‌లు ఇప్పుడే వస్తామని కుటుంబ సభ్యులకు చెప్పి ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చారు. నగరం నుంచి మైపాడ్ బీచ్‌కు కలిసి వెళ్లారు. మధ్యాహ్న మైనా పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వారికి ఫోన్లు చేశారు. వారు ఫోన్‌లు తీయకపోవ డంతో కుటుంబసభ్యులు కంగారుపడ్డారు. కొద్దిసేపటికే పోలీసులు ఫోన్ చేసి మైపాడు బీచ్‌లో మీ పిల్లలు మృతి చెందారని చెప్పడంతో కన్నపేగు తల్లడిల్లిపోయింది. జీజీహెచ్ మార్చురీ వద్దకు మృతదేహాల ను తీసుకువస్తున్నట్లు తెలపడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు పరుగున అక్కడకు చేరుకున్నారు. అంబులెన్స్‌లో మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. తజీమ్ లేవరా.. నాన్న!! అంటూ మృతదేహంపై పడి తల్లిదండ్రులు రోదించారు.

సముద్రంలో వేటకు వెళ్లి..



కావలి రూరల్ : సముద్రంలో వేటకు వెళ్లి ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కావలి మండలం తుమ్మలపెంటలో జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. తుమ్మలపెంట పంచాయ తీ పెదరాముడుపాలెంకు చెందిన కాటంగారి బ్రహ్మయ్య (34) శనివారం రాత్రి గ్రామస్థులతో కలిసి జువ్వలదిన్నె హార్బర్ నుంచి బోటులో చేపలు పట్టేం దుకు వెళ్లాడు. తుమ్మలపెంట సమీపంలో చేపలు పడుతూ ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు బోటులో నుంచి కిందపడి గల్లంతయ్యాడు. పెదరాము డుపాలెం సముద్రతీరానికి కొట్టుకువచ్చిన బ్రహ్మయ్య మృతదేహాన్ని రూరల్, మెరైన్ ఎస్ఐలు తిరుమలరెడ్డి, జానకిరామయ్యలు పరిశీలించారు. మృతుడికి భార్య గాయత్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తిరుమల రెడ్డి తెలిపారు.

ఆత్మకూరు చెరువులో యువకుడు..



● పోలీస్, ఫైర్ సిబ్బంది ముమ్మర గాలింపు

ఆత్మకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు పట్టణ సమీపంలోని చెరువులో ఆదివారం సాయంత్రం నలిశెట్టి మహేష్ (30) అనే యువకుడు గల్లంతు అయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. చెరువులో ఈతకు దిగిన మహేష్ కొద్దిసేపటికే నీట మునిగి గల్లంతయ్యాడు. తాను ఈత కొట్టలేకపోతున్నానని, రక్షించమని కేకలు వేయడంతో సమీపంలో ఉన్న అయ్యప్పభక్తులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న సీఐ గంగాధర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో హుటాహుటిన చెరువు వద్దకు చేరుకున్నారు. చెరువు మొత్తం జల్లెడ పట్టినా మహేష్ ఆచూకీ తెలియరాలేదు. ఆత్మకూరులో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న మహేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జలం.. పుష్కలం

- భూగర్భాన 5.50 మీటర్లలోనే గంగమ్మ
- ప్రతి మండలంలోనూ అధిక వర్షపాతం
- నిండు కుండలను తలపిస్తున్న చెరువులు

నెల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పుష్కలంగా కురిసిన వర్షాలతో జిల్లాలో భూగర్భ జలమట్టం భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం 5.50 మీటర్లలోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో పోలిస్తే ఒక మీటరు మేర జలాలు పైకి రావడం విశేషం. కొన్ని మండలాల్లో గణనీయంగా జలమట్టం పెరగగా, మెట్ట ప్రాంతాల్లో కూడా పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. దుత్తలూరు మండలంలో గతేడాది అక్టోబరులో 16.8 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉండగా, ఇప్పుడు 14.50 మీటర్లలోతులో ఉన్నాయి. కలువాయిలో 10.22 మీటర్ల నుంచి 7.65 మీటర్లకు, మనుబోలులో 21.18 మీటర్ల నుంచి 11.2 మీటర్లకు, సీతారామపురంలో 15.65 మీటర్ల నుంచి 11.85 మీటర్లకు జలమట్టం పెరిగింది. మెట్ట ప్రాంతాల్లోని పంటలు బోర్ల ఆధారంగా సాగు జరుగుతుండగా, కొన్ని సమయాల్లో ఆ బోర్లకు నీరు అందేది కాదు. అయితే ఇప్పుడు జలమట్టం పైకి పెరగడంతో మెట్ట ప్రాంతాలకు ఊరట కలగనుంది.



కలుజు పారుతున్న అల్లూరు చెరువు (ఫైల్)

● పుష్కలంగా వర్షాలు

ఈ ఏడాది జిల్లాలో వర్షాలు పుష్కలంగా కురిశాయి. సాధారణ వర్షపాతానికి మించి నమోదైంది. భూగర్భ జలమట్టం పెరగడానికి ఇదే ప్రధాన కారణం. సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 104.8 మి.మీ కాగా కురిసింది 59.77 మి.మీ. అంటే ఆ నెలలో 40 శాతం మేర తక్కువ వర్షం కురిసింది. కానీ అక్టోబరు నెలకు వచ్చే సరికి సాధారణ వర్షపాతం 245.05 మి.మీ కాగా 307.73 మి.మీ కురిసింది. మొత్తంగా జూన్ నుంచి ఇప్పటి వరకూ చూస్తే.. 603.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 796.8 మి.మీ వర్షపాతం నమోదైంది. 32 శాతానికి పైగా అధిక వర్షం కురిసింది. జిల్లాలో ఏ ఒక్క మండలంలో కూడా లోటు వర్షపాతం నమోదు కాకపోవడం విశేషం.

● చెరువులకు జలకళ

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. రెండో పంట ముగిసే సమయానికి చెరువుల్లో కూడా నీటి మట్టం తగ్గిపోయింది. ఇప్పుడు కీలకమైన రబీ సీజన్ ప్రారంభంలోనే సోమశిల, కండలేరు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయాల్సిన అవసరం లేకుండా చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. మొత్తం సామర్థ్యంలో 90 మేర నీరు నిల్వ ఉంది. జిల్లాలో 1007 చెరువులు ఉండగా, వాటిలో సుమారు 600 చెరువులు పూర్తిగా నిండిపోయాయి. మిగిలిన చెరువుల్లో 75 శాతం మేర నీరు ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నీటితో రబీ సీజన్‌లో ఒక తడిని పూర్తి చేయవచ్చునని అంటున్నారు. అదే సమయంలో చెరువుల్లో నీటి నిల్వ ఫలితంగా ఆ పరిసరాల్లో భూగర్భ జలమట్టం కూడా పెరుగుతోంది.

'సోమశిల'కు భారీగా తగ్గిన ఇన్‌ఫ్లో

● డ్యాంలో 69.324 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. శనివారం 48,460 క్యూసెక్కులు వస్తుండగా ఆదివారానికి 27,626 క్యూసెక్కులుగా నమోదైనట్లు ఇంజనీర్లు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 69.324 టీఎంసీలు నిల్వ ఉంది.

సంగం బ్యారేజీకి తగ్గిన ప్రవాహం

సంగం: సంగం బ్యారేజీకి వస్తున్న వరద నీటి ప్రవాహం ఆదివారం భారీగా తగ్గింది. సోమశిల నుంచి వస్తున్న నీటితోపాటు బీరాపేరు, బొగ్గేరు నుంచి సుమారు 49వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో బ్యారేజి వద్ద నీటిమట్టం 12.4 అడుగుల నుంచి 10.2 అడుగులకు తగ్గింది.

గండిపాళెంలో 23 అడుగుల నీరు

ఉదయగిరి : మండలంలోని గండిపాళెం జలాశయ నీటిమట్టం 23 అడుగులకు చేరిందని జలవనరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి తెలిపారు. జలాశయ సామర్థ్యం 35 అడుగులు కాగా ప్రస్తుతం 23 అడుగులకు నీరు చేరినట్లు తెలిపారు. జలాశయం పైతట్టు ప్రాంతంలో పిల్లాపేరు, దున్నపోతుల వాగులతోపాటు పలు చెరువులు అలుగులు పారుతుండడంతో జలాశయంలోకి 276 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు తెలిపారు.

రేషన్ మాఫియాకు
చెక్ పడేనా!?

- పేదల బియ్యం పక్కదారి పట్టడంపై ప్రభుత్వం సీరియస్
- సివిల్ సప్లయిస్ అధికారులపై చర్యలు
- మాఫియా డాన్లపైనా చర్యలకు సన్నద్ధం
- రేషన్ అక్రమాలను ముందే వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'
- నాడు పట్టించుకోని అధికార యంత్రాంగం

నెల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రూ.20లకు కొనుగోలు.. రూ.50లకు అమ్మకంగా జరుగుతున్న రేషన్ మాఫియా దందాకు ఇకనైనా చెక్ పడుతుందా!? ఇప్పటివరకూ అధికారుల అండతో చెలరేగిపోయిన అక్రమార్కులకు ఇప్పుడు ఆ అధికారులపై చర్యలతోనైనా బ్రేకులు పడతాయా..? అన్నది జిల్లాలో ప్రధాన చర్చగా నడుస్తోంది. ప్రతీ నెలా పేదల బియ్యం మాటున రూ.కోట్ల వ్యాపారం చేస్తున్న మాఫియా ఆగడాలపై ప్రభుత్వం కన్నెర్ర జేసింది. ఇటీవల అధికార పార్టీలో ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం పెద్ద దుమారాన్నే రేపింది. దీంతో అసలు నెల్లూరు జిల్లాలో ఏం జరుగుతోందన్న దానిపై విచారణ మొదలుపెట్టింది. చాలా ఏళ్లుగా రేషన్ దందా కొనసాగుతున్నప్పటికీ ఇటీవల కొందరు వ్యక్తులు ఒక మాఫియాగా ఏర్పడి భారీగా వ్యాపారం చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో విచ్చలవిడిగా రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఎక్కడికక్కడ సివిల్ సప్లయిస్ అధికారులతోపాటు ఇతర నిఘా విభాగాలను ఈ మాఫియా మేనేజ్ చేసుకుంటూ వస్తోంది. అయితే ఈ మాఫియా ఆగడాలు విపరీతమవడం, కొత్తవారిని ఈ దందాలోకి రానీయకుండా అడ్డుకోవడంతో లోలోపల జరుగుతున్న అక్రమాల భాగోతం కాస్తా రోడ్డు మీదకు వచ్చింది. నెల్లూరు శివారుప్రాంతం, కావలి ప్రాంతాల్లోని కొన్ని రైస్‌మిల్లుల కేంద్రంగా ఈ రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ అక్రమాలను అరికట్టడంతో సివిల్ సప్లయిస్ అధికారులు విఫలమయ్యారని గుర్తించిన ప్రభుత్వం.. ఇటీవల డీఎస్‌వోతోపాటు డీఎం సివిల్ సప్లయిస్ అధికారులను పిలిపించి పౌరసరఫరాల శాఖ మంత్రి, సెక్రటరీలు విజయవాడలో విచారించారు. ఆ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా సివిల్ సప్లయిస్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులపై బదిలీ వేటు వేసింది. పౌరసరఫరాల సంస్థ డీఎం కార్యాలయంలో కూడా కొందరిపై వేటు పడే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో రేషన్ మాఫియా డాన్లపైనా నిఘా వర్గాలు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. నెల్లూరు, ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తుండగా, వారికి కొందరు అధికార పార్టీకి చెందిన నేతలు సహకారం అందిస్తున్నట్లు కూడా గుర్తించారు. ఈ మాఫియాపై కూడా కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం బాగుంటున్నా వీటిని తినే విషయంలో అపోహలున్నాయి. ఇదే బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి మార్కెట్లోకి తీసుకొస్తుంటే వాటినే తింటుండడం గమనార్హం. రేషన్ దుకాణాల స్థాయిలోనే ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యంపై ఎక్కువగా అపోహలు కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బియ్యం బదులుగా కేజీకు రూ.10 చొప్పున డబ్బులు ఇచ్చేసి ఆ బియ్యాన్ని దొడ్డిదారిలో మాఫియా చేతికి అందజేస్తున్నారు. కొన్నిచోట్ల నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచే బియ్యం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలున్నా యి. జిల్లాలో ప్రతి నెలా 10 వేల టన్నులకుపైగా బియ్యాన్ని పంపిణీ చేస్తుండగా అందులో రెండు వేల టన్నులకుపైగా బియ్యం మాఫియా చేతుల్లోకి వెళుతున్నట్లు సమాచారం. తద్వారా ప్రతి నెలా రూ.10 కోట్లకుపైగా వ్యాపారం చేసి ప్రజాధనాన్ని దిగమింగుతున్నారన్న ప్రచారముంది.

ప్రతి నెలా రూ.10 కోట్ల వ్యాపారం



రేషన్ అక్రమాలపై జూలైలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలు

ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

జిల్లాలో జరుగుతున్న రేషన్ అక్రమాలపై ఈ ఏడాది జూలైలోనే 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. రేషన్ ఎలా పక్కదారి పడుతోంది? దానిని రీసైక్లింగ్ చేసి ఏవిధంగా మళ్లీ మార్కెట్లోకి తీసుకొస్తున్నారు? తెరవెనుక ఉన్న మాఫియా.. వంటి వివరాలను వెలుగులోకి తీసుకొచ్చింది. అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం, రేషన్ దుకాణాల్లో జరుగుతున్న వ్యవహారాలపై తనిఖీలు చేయకపోవడం వంటి విషయాలను కూడా ప్రస్తావించింది. అప్పట్లో జాయింట్ కలెక్టర్ 'ఆంధ్రజ్యోతి' కథనాలపై స్పందించి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కానీ నాడు అధికారులు పట్టించుకోలేదు. ఆ ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నారు.

పంటలు నష్టపోయిన రైతుల
వివరాలు నమోదు చేసుకోవాలి

- పూర్తి జాబితా ఆర్ఎస్‌కేల్లో ప్రచురిస్తాం
- డీఏవో సత్యవాణి

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను, వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి గణన చేస్తున్నారని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. నష్టపరిహారం పొందాలంటే ప్రతిరైతు విధిగా పంట నమోదు చేసుకుని ఉండాలని, అదేవిధంగా రైతు ఆధార్‌కు బ్యాంకు ఎన్‌పీసీఐ లింకు చేసుకుని ఉండాలని పేర్కొన్నారు. 33శాతం కన్న ఎక్కువ పంట నష్టం జరిగిన రైతులు ఉంటే వెంటనే రైతు సేవా కేంద్రం ఇన్చార్జుల ను కలవాలని సూచించారు. వారి పరిశీలన అనంతరం ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. యాప్‌లో రిజెక్ట్ చేసిన రైతుల వివరాలను తిరిగి అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. పూర్తి జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచుతామని పేర్కొన్నారు.



వేదగిరీశుడికి వైభవంగా
పవిత్రోత్సవాలు

నెల్లూరురూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వేదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం విష్వక్సేన పూజతో మొదలైన పవిత్ర పూజలు అగ్ని ప్రణయనం, సర్వ దైవత్యహోమం, జప్యము, నీరాజనము అనంతరం స్వామి, అమ్మవార్లకు వేద పండితుల మంత్రోశ్చరణల నడుమ పవిత్రాల సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మిలకు గిరి ప్రదక్షణ నిర్వహించారు. కుంభారాధన, ఉక్తహోమం, పారమాత్మిక హోమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత రెడ్డి దంపతులు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఈవో గోపి, మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, భాస్కరాచార్యులు, పాల్గొన్నారు. కాగా పవిత్రోత్సవాలు సోమవారం ముగియనున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,613
వెండి కిలో ధర రూ. 1,52,700
వెండి ఒక గ్రాము రూ.158.70

సీఐటీయూ జాతీయ సదస్సుకు తరలిరండి

నెల్లూరు(వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 31వ తేదీ నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలకు రోడ్డు మార్జిన్ వ్యాపారులు తరలిరావాలని సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు సుధాకర్, రోడ్డు వ్యాపారస్తుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ ప్రసాద్ పిలుపు నిచ్చారు. నగరంలో రోడ్డుమార్జిన్ వ్యాపారులను ఆదివారం కలిసి మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రోడ్డు మార్జిన్ వ్యాపారులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి


పూజలు చేస్తున్న నాయకులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 417వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు పోలినేని సదాశివయ్య ఆచారి, బుడంగుంట జానకిరామయ్య ఆచారి, తల్లం సురేష్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ హోం అధినేత జన్మదిన వేడుకలు


ఆనందనాయుడుకు కేక్ తినిపిస్తున్న బొల్లినేని వెంకట రామారావు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్రీన్‌హోం రియల్ ఎస్టేట్ అధినేత, సంస్థ ఎండీ బొల్లినేని హజరత్‌నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహజించారు. ఈ సందర్భంగా బొల్లినేని వెంకట రామారావు కేక్‌కట్ చేసి సంస్థ డైరెక్టర్ బొల్లినేని ఆనంద నాయుడుకు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించనున్న వెంచరును విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంపులూరి భాస్కర్‌గౌడ్, టీ.మధుసూదన్‌రావు, ఆర్.రామ్మోహన్, పీ.మాల్యాద్రి, వీవీ.శేషు, ఎస్కే సుభాన్, మార్కెటింగ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమం'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం పరిధిలోని 54 డివిజన్ నాయకులు సోమవారం నుంచి ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమం కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం రాత్రి రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ఆవిష్కరించగా ఆదివారం స్థానిక క్లస్టర్ ఇంచార్జ్ జహీర్ డివిజన్ పార్టీ కార్యాలయంలో 54వ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అందించే సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించనున్నట్లు తెలిపారు. దీనితోపాటు ప్రజల సమస్యలు తెలుసుకుని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమ నిర్వహిస్తున్నామన్నారు.

చిల్డ్రన్స్‌పార్క్ కూడలిలో అండర్‌పాస్ నిర్మించాలి

● మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిల్డ్రన్స్‌పార్క్ కూడలిలో జాతీయ రహదారికి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. జాతీయ రహదారి వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా చిల్డ్రన్స్‌పార్క్, చింతారెడ్డిపాళెం జంక్షన్‌లో జాతీయ రహదారికి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామని చెప్పారు. అయినా పాలకులకు చీమ కుట్టినట్లైనా లేదన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తున్న ఈ సమస్యపై ప్రభుత్వాలు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ బ్రిడ్జి లేక పోవటంతో అనేక ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, కొందరు దివ్యాంగులయ్యారని చెప్పారు. దగ్గరలో అపోలో, మెడికవర్ ఆసుపత్రులు ఉన్నాయని, ఎంతో మంది రోగులతో పాటు వేల మంది ప్రతిరోజు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఫ్లైఓవర్ సాధన కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన వేలమందితో మానవహారం కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్టా సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నుకున్న నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శిగా కొండా మాధవయ్య, కోశాధికారిగా వార్ల రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకోగా వారు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని నేతలను అభినందించారు.

కార్తీక మహాదీపోత్సవాన్ని జయప్రదం చేయండి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 5, 6, 7 తేదీల్లో జరిగే మహా కార్తీక దీపోత్సవం విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఆదివారం స్థానిక గణేష్ ఘాట్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో సమితి గౌరవాధ్యక్షుడు వీ.సత్యనాగేశ్వరరావు మాట్లాడారు. 5వ తేదీ దీపోత్సవ ర్యాలీ, కాశీ పండితులచే గంగాహారతి ఆకాశదీపం ప్రారంభం, 6న సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తారని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొనే దంపతులు 4వతేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలని శ్రీకంఠం రమణయ్య తెలిపారు. 7న స్వర్ణలింగేశ్వరుడి కుంబాభిషేకం జరుగుతుం దని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కొండపల్లి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మండ్ల ఈశ్వరయ్య, ముక్కాల వ్యాస ప్రసాద్, వి.హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

'వివేకానంద'కు రాష్ట్రస్థాయి అవార్డులు


అవార్డులు అందుకుంటున్న వివేకానంద వాకర్స్ సభ్యులు

నెల్లూరు(విద్య), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఆదివారం జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లాకు చెందిన వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆరు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. ఉత్తమ క్లబ్, ఉత్తమ వైద్య శిబిరాలు, ఉత్తమ సమ్మర్‌క్యాంపుల పౌష్టికాహారం పంపిణీ, ఉత్తమ ఎంజీఎఫ్ అవార్డులతో పాటు ఉత్తమ అధ్యక్షుడుగా చింతల అమరేంద్రరెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా పొన్నం రవిచంద్రలకు అవార్డులు దక్కాయి. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి, గవర్నర్ పెద్ది శివరాంప్రసాద్‌లు నేతలకు అవార్డులను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్ర రెడ్డి, నేతలు కేపీ.రెడ్డి, ఆరి ప్రసాద్, రాఘవేంద్ర షెట్టి, స్వర్ణ రమేష్, కేఎంకే.రెడ్డి, సుబ్బారామిరెడ్డి, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

● ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌కు పలు విభాగాల్లో లభించిన అవార్డులు అందుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోబోలు, సత్యం, కార్యదర్శి స్నేహ సురేష్‌లు తెలిపారు.

● వీఆర్సీ వాకర్స్‌కు...

నెల్లూరు(హరనాథపురం): ఉత్తమ కార్యదర్శిగా వీఆర్సీ వాకర్స్ కార్యదర్శి షేక్ రియాజ్, ఉత్తమ వైద్య శిబిరాలు, ఉత్తమ యోగా అవార్డులను వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి, గౌరవాధ్యక్షుడు షేక్ నన్నేసాహెబ్ లు అందుకు న్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొ న్నారు.

అమీర్‌జాన్ చిత్రానికి ప్రశంసలు


అమీర్‌జాన్‌ను సన్మానిస్తున్న మండలి బుద్ధప్రసాద్

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఆర్ట్ అసోసియేషన్ 'గిల్డ్' నిర్వహించిన మన సంస్కృతి చిత్రకళా ప్రదర్శనలో దేశవ్యాప్తంగా 70 మంది చిత్రకారులు పాల్గొనగా నెల్లూరుకు చెందిన డాక్టర్ అమీర్‌జాన్ చిత్రానికి ప్రశంసలు అందాయి. దీంతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అమీర్‌జాన్‌ని సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొడవాటి తేజస్వి, శరత్‌చంద్ర, ఆర్‌డీ విల్సన్, గోళ్ల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

'భగవద్గీతపై అవగాహన లేని వ్యక్తి టీటీడీ సభ్యుడిగా అనర్హుడు'

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భగవద్గీతపై అవగాహన లేని రాజు టీటీడీ సభ్యుడిగా కొనసాగడానికి అనర్హుడని, తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మూలాపేట శ్రీకృష్ణధర్మరాజు స్వామి దేవాలయం వద్ద శ్రీకృష్ణుడికి పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. భగవద్గీత వలన అణచివేయబడిన వారిలో అభివృద్ధి లేదని ఆయన పేర్కొనడాన్ని ఖండించారు. శ్రీకృష్ణ పరమాత్ముడి జీవితాన్ని సమగ్రంగా తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, ఏవీ సుబ్బయ్య, నరాల సుబ్బారెడ్డి, కందుకూరు శివకుమార్, నారాయణయాదవ్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో నిర్లక్ష్యాన్ని సహించం


సొసైటీ అధికారులతో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రబీ వ్యవసాయ సీజన్ మొదలైనా ఇప్పటి వరకు రైతులకు యూరియా ఇవ్వకపోతే ఎలా అని, ఇలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చింతారెడ్డిపాళెం పీఏసీఎస్ అధికారులపై మండిపడ్డారు. ఆదివారం ఇక్కడకు వచ్చిన ఆయన యూరియా పంపిణీపై ఆరా తీశారు. రిజిస్టర్లను పరిశీలించి యూరియా పంపిణీ మొదలు పెట్టకపోవడంపై ఆగ్రహించారు. అనంతరం అక్కడకు వచ్చిన రైతులకు కార్డులు, యూరియా అందచేశారు. ఆయన వెంట వేదగిరి క్షేత్రం ఛైర్మన్ అచ్యుతరెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జీలు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసు ఉరెడ్డిలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం


వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వడ్డెర సామాజిక వర్గం నుంచి ఉపాధ్యాయులుగా అర్హత సాధించిన 20 మందిని ఆదివారం నగరంలోని హోటల్ హరిత సమావేశం మందిరంలో వడ్డెర ఐక్యవేదిక నాయకులు ఘనంగా సన్మానించారు. వీరితో పాటు వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన ముగ్గురు డైరెక్టర్‌లను, పీ హెచ్‌డీ డాక్టరేట్ పొందిన వారిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నీటిపారుదలశాఖ ఈఈ రాపూరు వెంకటేశ్వర్లు, వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పు భాస్కర్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు ఒలిపి మునుస్వామి, బత్తల కృష్ణయ్య, దేవుళ్ల భాస్కర్, గుంజి సుధాకర్, వల్లెపు శ్రీనివాసులు, ఉప్పు పద్మావతి, బెల్లం కొండ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వెల్లంటిలో సీపీఐ ర్యాలీ

నెల్లూరురూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లంటిలో సీపీఐ నాయకులు ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ భాగస్వామ్యాన్ని తీసేసి ప్రభుత్వమే నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగేంద్రసాయి డిమాండ్ చేశారు. పీపీపీ పద్ధతుల్లో మెడికల్ కళాశాలలు నిర్మిస్తే పేదలకు మెరుగైన వైద్యం అందదన్నారు. దీనిని పూర్తి రద్దు చేయాలని సూచించారు. పొట్టేపాళెం, ములుముడి ప్రాంతాల వద్ద కలుజులను ఆధునీకరించి వంతెనలు నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణయ్య, జిలాని, లీలామోహన్, ఆదినారాయణ, హరిలు పాల్గొన్నారు.

తూముకు చెక్క ఏర్పాటు

● ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన


తూముకు చెక్క ఏర్పాటు చేసిన ఇరిగేషన్ అధికారులు

మనుబోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడ వద్ద ఉన్న తూముకు ఆదివారం చెక్క ఏర్పాటు చేసి ఇరిగేషన్ ఏఈ కృష్ణ ప్రారంభించారు. తూముకు చెక్కలేక పోవడంతో యువకులు రేకులు అడ్డుగా పెట్టి నీళ్లను ఆపేసే పరిస్థితులు ఉందని సెప్టెంబరు 20న 'తూముకు చెక్కలేక పాట్లు' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. తూమును పరిశీలించి ఏర్పాటు చేయాల్సిన చెక్కను, అమర్చాల్సిన చోట కాంక్రీటు గోడను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. దీంతో. తూముకు చెక్క ఏర్పాటు చేయించి రైతుల సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డికి, ఇరిగేషన్ అధికారులకు మనుబోలు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం


నగదు అందచేస్తున్న శ్రీహరి దంపతులు

రాపూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన దేవస్థానంలో భక్తుల కోసం అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతి పట్టణం కొర్లగుంట వాస్తవ్యులు నాగినేని శ్రీహరి నాయుడు, నిహారిక కుమారుడు ఆర్యన్స్ జన్మదినం సందర్భంగా శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. ఆలయ పరిపాలన కార్యాలయంలో నగదును ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

మెగా కంటివైద్య శిబిరం అభినందనీయం

● ప్రారంభించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



కంటివైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక దృక్పథంతో మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని స్వాతి కాలేజ్ ఆఫ్ ఫార్మశీలో కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, కాటంరెడ్డి శోభారెడ్డిల ఆర్థిక సహకారంతో చెన్నై శంకర నేత్రాలయ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరం గురించి నిర్వాహకులు ఎమ్మెల్యేకి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదిరోజుల పాటు మెగా ఉచిత వైద్యశిబిరం ఉంటుందని, ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. తొలుత పరీక్షలు నిర్వహించి, మొబైల్ సర్జికల్ యూనిట్ ద్వారా శస్త్ర చికిత్సలు శిబిరంలోనే చేయడం సంతోషదాయకమన్నారు. ఇలాంటి సేవలు అందిస్తున్న శంకర నేత్రాలయ వైద్యులు, పేదల కోసం, వారి కంటిచూపు పునరుద్ధరించేందుకు శిబిరం ఏర్పాటుకు సహకరించిన ప్రసాద్‌రెడ్డి, శోభారెడ్డి, స్వాతి కళాశాల ఛైర్మన్ కే. శశిధర్‌రెడ్డి, డైరెక్టర్ ఎం. గోపీనాథ్, స్వాతి కాలేజ్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ డా. కే నివేదితకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పపీఠం.. నిత్యాన్నదాన నిలయం

● ఈనెల 20 వరకు మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ


అన్నదానం కార్యక్రమం

పొదలకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాలయం ప్రాంగణంలోని అయ్యప్ప పీఠంలో నియమ నిష్ఠలతో మాలధారణ చేసే స్వాములకు అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 20 తేదీ వరకు దాతల సహకారంతో ఉచితంగా బిక్ష అందిస్తూ ఔదార్యాన్ని చాటుతున్నారు. కొందరు స్వాములు పనుల్లో పడి సకాలంలో బిక్ష చేయలేని పరిస్థితులను గమనించిన పొదలకూరు అయ్యప్పసేవా సమాజం నిర్వాహకులు కార్తీక మాసం పూర్తయ్యే వరకు (30 రోజులు) పాటు రోజూ మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు. అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ, గోవింద, తదతర మాలధారులు ఇక్కడ బిక్ష స్వీకరిస్తున్నారు. ఆదివారం ఉభయకర్తలుగా టీడీపీ యువ నాయకుడు దేవినేని శరత్‌బాబు నాయుడు, శ్రావ్య, జనసేన నాయకులు నారదాసు రవి వ్యవహరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమాజం గౌరవాధ్యక్షుడు శివాడి పరంధామిరెడ్డి, ముత్తుకృష్ణ, వీరేపల్లి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కోటపాటి కృష్ణమనాయుడు, ట్రెజరర్ ఆడపాల మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మండలం పాటు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, బక్కయ్య నాయుడు, పెంచలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

రాపూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణంలోని మద్దెలమడుగు సమీపాన ఉన్న మహా విష్ణువు, అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. 18వ రోజు అన్నవితరణ సందర్భంగా జేమ్స్ స్కూల్ అధినేత బులగాకుల మునేంద్ర రెడ్డి, స్వాతి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఉదయం మహా విష్ణువు, అయ్యప్ప స్వామి ప్రతిమలకు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మాలధారులు భజనా కార్యక్రమం నిర్వహించిన అనంతరం అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమాలు ఆలయ కమిటీ పర్యవేక్షణలో నిర్వహించారు.

ఊచపల్లిలో దాహం.. దాహం!

● ఐదు రోజులుగా తాగునీరు లేక అవస్థలు


నీటికోసం ఎదురుచూస్తున్న మహిళలు

పొదలకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మండలం ఊచపల్లి గ్రామంలో గత ఐదు రోజులుగా తాగు నీరందక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని నీరు తాగడానికి పనికిరాకపోవడంతో సమీపాన ఉన్న కండలేరు జలాశయం నుంచి పైపుల ద్వారా గ్రామానికి మంచి నీటిని సరఫరా చేస్తుంటారు. ఇటీవల కండలేరు జలాశయం 60 టీఎంసీలకు చేరువకావడంతో స్పిల్ వే నుంచి వాగుకు నీరు మళ్లించేందుకు యంత్రాలతో కాలువ తవ్వకంతో ఈ తాగునీటి పైపులు ధ్వంసమయ్యాయి. దీంతో ఊచపల్లి గ్రామానికి నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. మొగుళ్లూరు, పొదలకూరు నుంచి వస్తున్న మినరల్ వాటర్ క్యాన్‌లను కొనుగోలు చేసి తాగుతున్నామని, వెంటనే పైపులు మరమ్మత్తులు చేసి నీరందించాలని కోరుతున్నారు. గతంలో ఈ గ్రామంలో నీరు కలుషితంగా మారి చాలా మంది అనారోగ్యం బారినపడ్డారు. ప్రస్తుతానికి ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని గ్రామస్తులు, మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రైతు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మనుబోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు చేస్తూ పొలంలోనే మరణించిన రైతు, కల్లుగీత కార్మికుడు కోసూరు శ్రీనువాసులు గౌడ్ కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి కుమారుడు సురేష్ గౌడ్, అల్లుడు రాజాగౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు సాని వెంకటరమణయ్య, పచ్చిపాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేమాలమ్మకు పొంగళ్ళు

మనుబోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపేట గ్రామదేవత మొలకల వేమాలమ్మకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా పొంగళ్ళు నిర్వహించారు. ఆలయం నిర్మించి రెండేళ్ల పూర్తి చేసుకోవడంతో వార్షికోత్సవ కార్యక్రమాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇనమడుగు వేణుగోపాల్‌రెడ్డి, ఏకొల్లు కోదండరామిరెడ్డి, అమీర్‌భాషా, వెంకటే ష్, చాన్‌భాషా పాల్గొన్నారు.

రోడ్డుపై బూడిద బల్కర్ల నిలిపివేత

ముత్తుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రోడ్లపై బూడిద కుమ్మరిస్తున్న బల్కర్లు, టిప్పర్లను ఆదివారం బ్రహ్మదేవం, బలిజపాలెం గ్రామస్తులు నిలిపివేశారు. బ్రహ్మదేవం సమీపంలో జెన్‌కో రోడ్డు కూడలిలో ఉదయం స్థానికులు బల్కర్‌లను అడ్డుకున్నారు. జెన్‌కో నుంచి వెట్ యాష్‌ను తీసుకువెళ్తున్న బల్కర్లు, టిప్పర్లు నుంచి తడి బూడిద పెద్ద ఎత్తున రోడ్లపై చేరుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండిపోయి ఈ బూడిద రేగి వాహన చోదకులకు ప్రమాదంగా మారుతోందన్నారు. జెన్‌కో రోడ్డు కూడలి వద్ద, బలిజపాలెం వద్ద రోడ్డుపై బల్కర్లు బారులుతీరాయి. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పోలీసులు సర్దిచెప్పి వాహనాలను పంపించారు.

మైపాడు బీచ్‌లో సముద్ర స్నానానికి రావద్దు

ఇందుకూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైపాడు బీచ్‌లో తుఫాను ప్రభావం వల్ల సముద్ర తీర ప్రాంతం తీవ్ర కోతకు గురై ప్రమాదకంగా మారినందున కార్తీక స్నానాలకు అనుమతి లేదని సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

పెంచలకోనలో చిలుక ద్వాదశి వేడుకలు

రాపూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రం నందు శనివారం కార్తీకమాసం క్షీరాబ్ది కైసిక (చిలుక) ద్వాదశి సందర్భంగా వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీవారి నందనవనములో అష్టోత్తర శత కలశాభిషేకము, సాల గ్రామ దాత్రి పూజలు జరిపిన అనంతరం భక్తులకు కార్తీక వనభోజనములు నిర్వహించడం జరిగింది. సాయంత్రం బంగారు గరుడ వాహనం పై శ్రీవారిని ఆస్థాన పరిచి, పరిమళ పుష్పాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి క్షేత్రోత్సవం నిర్వహించామని, ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణలతో అత్యంత వైభవంగా నిర్వహించామని ఆలయ ఉప కమిషనరు పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి సామాజిక సేవా అవార్డు

ముత్తుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూబీఎస్ ఫోరం నిర్వహించిన 15వ వార్షిక కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సమ్మిట్, అవార్డ్స్ 2025లో దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఉత్తమ సామాజిక సేవా అవార్డును అందుకుంది. ఈ అవార్డును కంపెనీ తరఫున సీఎస్ఆర్ హెడ్ ఆల్బర్ట్ డేవిడ్ పీటర్, సీనియర్ మేనేజర్ కామేశ్వరరావులు ఆదివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఈవో జనమేజయ మహాపాత్ర మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచడంలో నిరం తర కృషికి ఈ గుర్తింపు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



ఉదయగిరిలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన కృష్ణ మందిరం కల్యాణ మండపం ఆవరణలో ఉన్న కోనేరు ఇటీవల కురిసిన వర్షాలకు జలకళ సంతరించుకొంది. కొన్నేళ్లుగా చుక్క నీరు లేక వెలవెలబోయిన ఈ కోనేరు ప్రస్తుతం నీటితో నిండు కుండలా మారింది. ఇటు ఆనకట్ట, అటు కోనేరు నీటితో నిండి ఆహ్లాదకర వాతావరణం నెలకొనడంతో సందర్శకులను ఆకర్షిస్తోంది.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

వైభవంగా బ్రహ్మంగారి జయంతి

జిల్లాలోని అన్ని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠాలు, ఆలయాల్లో ఆదివారం బ్రహ్మంగారి 417వ జయంతిని వైభవంగా నిర్వహించారు. విశేష పూజలు, అన్నదానాలు జరిగాయి. నగరంలోని విరాట్‌నగర్‌లో గాయత్రి సమేత విశ్వకర్మ భగవాన్, గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అభిషేకాలు, కలిశ తీర్థం, పూలంగి సేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమాలను ఉభయకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- నెల్లూరు(సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)



కార్తీక వన భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

భగవంతుడిని నమ్ముకుంటే అంతా మంచే!

- 6 నుంచి లక్ష దీపోత్సవ వేడుకలు: ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్ని కష్టాలు, నష్టాలు ఎదురైనా భగవంతుడిని నమ్ముకుంటే అంతా మంచే జరుగుతుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బాలాజీనగర్ త్యాగరాజ కల్యాణ మండపంలో సింహపురి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మహారుద్రాభిషేకం వేడుకలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ మహారుద్రా భిషేకాన్ని 2006 నుంచి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ క్రమం తప్పకుండా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో వీఆర్ హైస్కూల్ మైదానంలో జరిగే లక్ష కార్తీక దీపోత్సవాలకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ లక్ష దీపోత్సవాలు, వెంకటేశ్వర వైభవం, జిల్లా ప్రజల దాహార్తిని తీరుస్తున్న వ్యక్తి మనసుల్లో దేవుడని, ఆస్థానం వేమిరెడ్డికి దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపకుడు ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, మాచవోలు రమేష్ శర్మ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ సురేంద్రరెడ్డి, మాజీ కార్పొరేటర్లు కోటంరెడ్డి సంధ్య, అంచూరి జానకి, కప్పిర రేవతి, బీవీ లక్ష్మి, అమరా మోహన్‌రావు, వినోద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి



తేలిన పంటల నష్టం లెక్క!

మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాల లెక్క కొలిక్కొ వచ్చింది. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో పరిశీలన దాదాపుగా పూర్తయింది. నష్టపరిహార జాబితాలను సిద్ధం చేసే పనిలో అధికారులు పూర్తిగా నిమగ్నమయ్యారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 588.4 హెక్టార్లలో వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు, మరో 6.48 హెక్టార్లలో కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

- 594 హెక్టార్లలో దెబ్బతిన్న పైరు
- నివేదిక సిద్ధం చేసిన వ్యవసాయ, ఉద్యాన అధికారులు
- నష్టపరిహారం పెంచిన ప్రభుత్వం



అనంతసాగరం మండలంలో దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తుఫాను ప్రభావంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో దాదాపుగా ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్న దశ కావడంతో వరి సాగు చేసిన రైతులు జిల్లా వ్యాప్తంగా దాదాపుగా కోతలు పూర్తి చేసుకున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మరో రెండు, మూడు రోజుల్లో పంటను కోసేందుకు రైతులు సిద్ధపడుతున్న సమయంలో జిల్లాలో మొంథా తుఫాను కారణంగా ఎడతెరపి లేకుండా వర్షాలు పడ్డాయి. దీనికితోడు సోమశిల ప్రాజెక్టుకు వరద అధికంగా చేరడం పెన్నానదికి నీటిని వదలడం కారణంగా కాలువలు, లోతట్టు ప్రాంతాల్లో వరద నీటితో నిండిపోయింది. దీంతో కోత దశలో ఉన్న వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలతోపాటు బీర, చామ, ఉల్లిపాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా వరిపంట నేలవాలినా రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో పంటను కాపాడుకున్నారు. మరికొంత మంది తడిచిన ధాన్యాన్ని వచ్చిన ధరకు దళారులకు అమ్ముకున్నారు.

● అనంతసాగరంలో అత్యధికం

తుఫాను కారణంగా జిల్లాలో అత్యధికంగా అనంతసాగరం మండలంలోనే వరి పంట దెబ్బతింది. 301.19 హెక్టార్లలో చేతికొచ్చిన పంట నీట మునిగినట్లు వ్యవ సాయ శాఖ అధికారులు లెక్కగట్టారు. జిల్లా వ్యాప్తంగా 588.4 హెక్టార్లలో వర్షాలు, వరదలతో పంటలు దెబ్బతింటే ఒక్క అనంతసాగరంలోనే 301.19 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ఆ తరువాత 89.12 హెక్టార్లలో కలువాయి మండలంలో వరి నీటమునిగింది. అదేవిధంగా సీతారామపురంలో 49.22 హెక్టార్లు, చేజర్లలో 38.65 హెక్టార్లు, వరికుంటపాడులో 25.44 హెక్టార్లు, మర్రిపాడులో 20.04, ఆత్మకూరులో 16.22, కందుకూరులో 13.25, జలదంకిలో 8.75, గుడ్లూరులో 8.51, సంగంలో 4.18, ఉదయగిరిలో 2.81, కలిగిరిలో 2.63, దుత్తలూరులో 2.51, ఉలవపాడులో 2.48, అనుసముద్రంపేటలో 1.72, కావలిలో 1.69హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో 1.9 హెక్టార్లలో వేరుశగన, 2.12 హెక్టార్లలో మొక్కజొన్న పంటలు ఉన్నా యి. అదేవిధంగా 6.48 హెక్టార్లలో చేమగడ్డ, బీరకాయ, ఉల్లిపాయల పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారులు లెక్కగట్టారు.

● నష్టపరిహారం పెంపు

ప్రకృతి వైపరీత్యాలు, పంట దిగుబడులు తగ్గడం వంటి ఇతర పరిస్థితుల్లో నష్టపోతున్న అన్నదాతలకు ప్రభుత్వాలు నష్టపరిహారం అందిస్తుంటాయి. అయితే ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఈ పరిహారాన్ని పెంచి రైతులకు అండగా నిలిచింది. మొంథా తుఫాను కారణంగా జిల్లాలో వరి, వేరుశగన, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. గతంలో వరి పంటకు హెక్టారుకు రూ.17వేలు మాత్రమే నష్టపరిహారం అందేది. అయితే ప్రస్తుతం ఈ పరిహారాన్ని రూ.25వేలకు పెంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. దాదాపుగా రూ.8వేలు అదనంగా పెంచి రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. వేరుశనగ పంటకు హెక్టారుకు గతంలో రూ.17వేలు ఇస్తుండగా ప్రస్తుతం రూ.25వేలకు పెంచింది. అదేవిధంగా మొక్కజొన్న పంటకు రూ.12500లు ఇస్తుండగా ప్రస్తుతం రూ.15వేలు చేసింది. కూరగాయల పంటలకు కూడా హెక్టారుకు రూ.25వేలు చేసినట్లు ఉద్యాన శాఖ అధికారి పి.సుబ్బారెడ్డి తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్ వివరాల కోసం 1100 నెంబర్‌కు డయల్ చేసి సంప్రదించాలని పేర్కొన్నారు.



అనంతసాగరం : చేతిపంపు చుట్టూ ఉన్న మురుగునీరు

డయేరియాపై జాగ్రత్త!

- వర్షాలతో కలుషితమవుతున్న మంచినీరు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం

నెల్లూరు (వైద్యం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా జిల్లాలో వర్షాలు విస్తారంగా పడ్డాయి, దీని కారణంగా మంచినీరు కలుషితమయ్యే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు డయేరియా (అతిసారా) బారిన గురయ్యే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మంచినీటిపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచిస్తున్నారు. పంచాయతీ, మున్సిపాలిటీలు సరఫరా చేసే తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇటీవల హెచ్చరించారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఉన్న 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంచినీరు కాచి తాగాలని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. డయేరియాకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలలో వైద్య సిబ్బంది వెంటనే ప్రథమ చికిత్స కింద ఓఆర్ఎస్ ప్యాకెట్లను వినియోగించాలని అవగాహన కలిగించనున్నారు. డయేరియాకు గురైన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యచికిత్సలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వైద్యాధికారులు కూడా ముందుగా హెచ్చరికలు జారీ చేయటంతో డయేరియా బాధితులకు వెంటనే చికిత్స అందించేందుకు వైద్యులు సమాయత్తం అయ్యారు. గతంలో నెల్లూరులోని కుసుమ హరిజనవాడ, బట్వాడిపాళెంలలో నీటి కలుషతం కారణంగా 70 మంది డయేరియాకు గురికాగా ఇందులో ఇద్దరు మృత్యువాత పడ్డారు. అలాగే జిల్లాలోని పలు మండలాలలో గత ఏడాది డయేరియా కేసులు ఆందోళన కలిగించాయి.

● మంచినీటి పథకాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని 2వేల మంచినీటి రక్షిత పథకాలు ఉన్నాయి. ప్రతి 15 రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఇటీవల భారీ వర్షాల కారణంగా ఆయా ట్యాంకులలో క్లోరినేషన్ కూడా చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో ఆయా ట్యాంకుల ద్వారా వచ్చే నీరు కలుషితంగా మారుతున్నాయి. అలాగే పలు మురికి కాల్వలలో నీటి పైపులు ఉండటం వాటికి రంధ్రాలు పడి మురుగు మంచినీటిలో కలుస్తున్నాయి. వీటి ద్వారా పలువురు డయేరియాకు గురయ్యే అవకాశం ఉండటంతో ఆయా పైపులైన్లపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో నీటిసరఫరా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకించి విద్యార్థులు ఉండే సంక్షేమ హాస్టళ్లలో శుభ్రమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

డయేరియా నివారణకు చర్యలు



జిల్లాలో డయేరియా వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాము. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున మంచి ఆరోగ్యకరమైన తాగునీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. డయేరియాకు గురికాకుండా ఉండాలని వైద్య సిబ్బంది గ్రామాలలో ప్రచారం కూడా చేస్తున్నారు. ఎక్కడైనా కేసులు నమోదయితే వెంటనే చర్యలు తీసుకోవాలని వైద్యులకు ఆదేశాలు జారీ చేశాం.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ప్రాకారోత్సవంలో ఆది దంపతులకు కర్పూర హారతి



నేత్రపర్వం ప్రాకారోత్సం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాసం పూజలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి విశేష అలంకారం, పూజలు జరిగాయి. సాయంత్రం శివనామ భజనలు మారుమోగాయి. కార్తీక దీపారాధనలతో ఆలయంలో వెలుగులు నిండాయి. రాత్రి శివపార్వతుల ఆలయ ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ఉభయకర్తలు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

సనాతన ధర్మం కన్నతల్లి లాంటిది!

- శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి
- కొండబిట్రగుంట గిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తులు

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అతి పురాతనమైన సనాతన ధర్మం కన్నతల్లి వంటిదని తిరుపతిలోని మహిళా శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి అన్నారు. కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9వ నగర సంకీర్తన గిరిప్రదక్షిణ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. నెల్లూరు, బాపట్ల, తిరుపతి జిల్లాల నుంచి ఎస్ఎస్ఎఫ్, ఆర్ఎస్ఎస్ సభ్యులు, భక్తులు భారీగా తరలివచ్చారు. జై శ్రీరామ్, గోవింద నామ స్మరణలతో క్షేత్రం మారుమోగిపోయిం ది. శ్రీవారి ఆలయ ప్రాంగణలో జరిగిన కార్య క్రమంలో రమ్యానంద భారతిని వేదపండితులు ఘన స్వాగతం పలికారు. మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామి అమ్మవార్లను ఆమె దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వక్త అమర లింగన్న, కొత్త రామకృష్ణ, కొండారెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర కో కన్వీనర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. కావలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పాపారావు, బోగోలు, దగదర్తి సబ్ ఇన్‌స్పెక్టర్లు ప్రభాకర్, జంపాని కుమార్, సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేశారు.



గిరి ప్రదక్షిణ ఉత్సవంలో జెండాలు చేతపట్టి పాల్గొన్న భక్తులు

హక్కుల కోసం సమష్టిగా ఉద్యమిద్దాం

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్
- మాలల రాజ్యాధికార సాధన సమితి అధ్యక్షుడిగా దాసరి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాలల హక్కుల సాధన కోసం మాలలం దరూ సమష్టిగా ఉద్యమించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరం లోని రోటరీ ఆడిటోరియంలో మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణా వెంకయ్య అధ్యక్షతన జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాలల హక్కులను కాలరాసే వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యనమల సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలలో అత్యధికంగా మాలలు ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన వర్గీకరణను పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తున్నా మన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టవద్దని తెలిపారు. ఈ సందర్భంగా మాలల రాజ్యాధికా ర సాధన సమితి నూతన అధ్యక్షుడిగా దాసరి చెన్నకేశవులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్ర మంలో నెల్లూరు ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసునాయుడు, మాలమహానాడు నేతలు బాలచెన్న య్య, పూతలపట్టు ప్రభాకర్, భద్రాచలం బాబు, కొప్పోలు రఘు, లాలం పెంచలయ్య, పోలా విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటార్ బైక్‌ల ఢీ

- నలుగురికి తీవ్ర గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దుత్తలూరుకు సమీపంలోని నర్రవాడ మార్గంలో భారత్ పెట్రోల్‌బంకు వద్ద 565 జాతీయ రహదారిపై రెండు మోటార్‌బైక్‌లు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకొంది. వివరాల మేరకు.. దుత్తలూరుకు చెందిన ఉదయ్, పూజిత దంపతులు తన కుమారుడికి అనారోగ్యంగా ఉండడంతో ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. అలాగే వరికుంటపాడు మండలం రామదేవులపాడు గ్రామానికి చెందిన మధు, రోశయ్యలు దుత్తలూరు వైపు నుంచి స్వగ్రామానికి వెళుతున్నారు. ఈ తరుణంలో పెట్రోల్‌బంకు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

పేదవారి కోసం 'వీపీఆర్ నేత్ర'

- గ్రామాల్లో ఉచిత కంటి వైద్యపరీక్షలు
- నేడు రామాపురంలో ప్రారంభించనున్న ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరు (హరనాథపురం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వీపీఆర్ నేత్ర అనే వినూత్న సేవా కార్యక్రమాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వరికుంటపాడు మండలం రామాపురంలో సోమవారం ప్రారంభించనున్నారు. ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహించిన ఎంపీ వేమిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ప్రజల కంటి వైద్యానికి సంబంధించి పరీక్షలు నిర్వహించేందుకు వీపీఆర్ నేత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తనకు ఎంతో ఇష్టమైన ఉదయగిరి నియోజకవర్గం నుంచే అనేక ప్రజాహిత కార్యక్రమాలను వేమిరెడ్డి ప్రారంభిస్తుంటారు. అందులో భాగంగానే వీపీఆర్ నేత్రను కూడా అక్కడ నుంచే ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం కోసం కంటి పరీక్షలకు అవసరమైన అత్యాధునిక పరికరాలతో కూడిన ప్రత్యేక బస్సును తయారు చేయించారు. ఇందులో అన్నీ పరీక్షలను ఉచితంగా చేస్తారు. కంటి పరీక్షలతోపాటు కళ్ల జోళ్లను కూడా బస్సులోనే తయారు చేయించి అందచేస్తారు. దశలవారీగా నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు విస్తరించనున్నారు.

- వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వీపీఆర్ అమృత ధార పేరుతో జిల్లావ్యాప్తంగా దాదాపు 170 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించారు. అలాగే, వీపీఆర్ విద్య ద్వారా పేద పిల్లలకు ఉచిత విద్యను, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వీపీఆర్ భరోసా ద్వారా 950 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను అందచేశారు.
- ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలని ఎంపీ వేమిరెడ్డి సౌజన్యంతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కోవూరు మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించారు.

హైదరాబాదులో ఆదివారం బొల్లినేని హజరత్ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఆయన మిత్రుడు దువ్వూరు సురేష్‌రెడ్డి



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.11613

వెండి కిలో ధర రూ. 152700

వెండి ఒక గ్రాము రూ.158.70

12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి : ఎస్టీయూ

కందుకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తక్షణం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమిం చాలని, ఐఆర్ ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదినారాయణ, జోనల్ కన్వీనర్ గద్దగుంట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో కందుకూరు జోనల్ సమావేశం ఆదివారం జరిగింది. లింగ సముద్రం మండలానికి ఎస్టీయూ అధ్యక్షుడిగా రావి మల్లికార్జునను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు పొతకమూరి కృష్ణయ్య, చేతల వెంకటేశ్వర్లు, గళ్లా వెంకటరావు, పి. జాన్సన్, కందుల శ్రీను, తన్నీరు తిరుపాలు, ఎన్వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల కుటుంబానికి ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ

కందుకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వృద్ధ దంపతులు పువ్వాడి పున్నయ్య, రోశమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. వారి కుమారుడు, 3వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి కోటయ్యను, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, ఎన్వీ రమణయ్య, బత్తిన మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలి

మున్సి పల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు

కావలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా చేయూతను అందించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా యూనియన్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకు నివాస స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయకుండా ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలానీ బాష, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు మాలకొండయ్య, సీపీఐ సహాయ కార్యదర్శి ఎన్ రమణయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మల్లి అంకయ్య, కావలి అధ్యక్ష, కార్యదర్శులు ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, నేతలు పీ సుబ్బరాయుడు, ఎం వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, చేవూరు కొండయ్య, సీపీఎం నాయకుడు పెంచలయ్య, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.


కార్మిక యూనియన్ కార్యాలయ ప్రారంభోత్సవంలో నాయకులు

ఉత్సాహంగా క్రీడాపోటీలు

కావలి (టౌన్) నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేబీ డిగ్రీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో విశ్వోదయ డీఆర్ బాలల దినోత్సవ క్రీడాపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డిలు క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలు ప్రారంభించారు. వినయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల దశనుంచి క్రీడాకారులను ప్రోత్సాహమందించాలన్న దృక్పధంతో ప్రతి ఏటా క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నవంబర్ 14న బాలల దినోత్సవం జరుగుతుందని జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలో తలపడుతున్న విశ్వోదయ, జెడ్పీ బాలికల పాఠశాల జట్లు

విజేతలు వీరే...

బాలుర కబడ్డీలో విన్నర్స్ జెడ్పీహెచ్ఎస్ కావలి, రన్నర్స్‌గా ఆర్ఎస్ఆర్ గౌరవరం, వాలీబాల్‌లో విన్నర్స్‌గా వీబీహెచ్ఎస్, రన్నర్స్‌గా ఆర్ఎస్ఆర్ గౌరవరం, ఫుట్‌బాల్‌లో విన్నర్స్‌గా నారా యణ ఆర్ఎమ్‌సీ, రన్నర్స్‌గా వీబీహెచ్ఎస్ కావలి, బాల్ బ్యాడ్మింటన్‌లో విన్నర్స్‌గా జెడ్పీహెచ్ఎస్ ఆర్‌సీపాలెం, రన్నర్స్‌గా వీబీహెచ్ ఎస్ కావలి, టేబుల్ టెన్నిస్‌లో విన్నర్స్‌గా శ్రీవేదం గ్లోబల్ కొత్తపల్లి, రన్నర్స్ గా వీబీహెచ్ఎస్ కావలి, కోకోలో విన్నర్‌గా జెడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి, రన్నర్స్ గా జెడ్పీహెచ్ఎస్ ఆర్సీపాలెం జట్లు నిలిచాయి. బాలికల కబడ్డీ పోటీల్లో వీజీహెచ్ఎస్ విన్నర్స్‌గా, కెజీబీవీ రన్నర్స్‌గా, త్రోబాల్‌లో వీజీహెచ్ఎస్ విన్నర్స్‌గా, కావలి జెడ్పీ రన్నర్స్‌గా, ఖోఖోలో వీజీహెచ్ఎస్ విన్నర్స్‌గా, కొత్తపల్లి జెడ్పీ రన్నర్స్‌గా, వాలీబాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ, కావలి రన్నర్స్‌గా కావలి వీజీహెచ్ఎస్ జట్లు నిలిచాయి. టెన్నికాయిట్‌లో విన్నర్స్‌గా కేజీబీవీ, ముసునూరు రన్నర్స్‌గా కావలి వీజీహెచ్ఎస్, బ్యాడ్మింటన్‌లో విన్నర్స్‌గా కావలి వీజీహెచ్ఎస్, రన్నర్స్‌గా భాష్యం జట్లు నిలవగా బాలికల ఓవరాల్ ఛాంపియన్‌గా వీజీహెచ్ఎస్ కావలి జట్టు నిలిచింది.

కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలి

● అయ్యప్ప భక్తుల ర్యాలీ

ఉలవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిలుపుకోవాలని కోరుతూ కరేడుకు చెందిన బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు, అయ్యప్ప మాలదారులు ఆదివారం ప్రదర్శన చేశారు. ప్రస్తుత నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు కందుకూరు నియోజకవర్గం లోనే ఉంచాలనే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మార్కాపురంను కొత్త జిల్లాగాను, అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలుపుతామని మాట ఇచ్చారని గుర్తుచేశారు.

ప్రకాశంలోనే చేర్చాలి

● మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చి ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులు పాలేటి కోటేశ్వరరావు, బూసి సురేష్‌బాబు, నేతి మహేశ్వరరావు, పొడపాటి శ్రీను తదితరులు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన ఒంగోలుకు


ర్యాలీ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

కేవలం 43 కి.మీ దూరంలో ఉన్న కందుకూరును తీసుకెళ్లి 120 కి.మీ దూరంలో ఉన్న నెల్లూరులో కలపటం అన్యాయమని నిరసిస్తూ పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా 55 రోజులు దీక్షలు చేయటంతో పాటు సంపూర్ణ బంద్ నిర్వహించారని వారు గుర్తుచేశారు. కందుకూరులో ఉన్న అనేక డివిజన్ కార్యాలయాలు కూడా సింగరాయకొండ, కావలి, ఒంగోలుకు తరలిపోయి తీరని నష్టం జరిగిందని విమర్శించారు. ఈనేపథ్యంలో కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలపటంతో పాటు డివిజన్ కేంద్రంగా పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌చేశారు.

ఉత్తమ శిక్షణతోనే ఉన్నత స్థాయి

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ శిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఇంటర్నేషనల్ మాస్టర్ ఈ రవిగన్ నిరూపించారని డాక్టర్ కే తిరుపతమ్మ పేర్కొన్నారు. బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన 42వ క్యాడెట్ స్టేట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో బిట్రగుంట తైక్వాండో విద్యార్థులు 8 మంది పాల్గొన్నారు. ముగ్గురు బ్రాంజ్, నలుగురు సిల్వర్ మెడల్స్ సాధించగా, బచ్చుసాయి 80 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. విజేతలకు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ బర్నాడ్, గౌరవాధ్యక్షుడు పీ స్వర్ణన్‌రాజ్, మాజీ గౌరవాధ్యక్షుడు ఎన్ఎస్ యాదవ్, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోవిందరాజులు, ప్రముఖ వ్యాపారి కే జనార్దన్ రెడ్డి, విద్యార్థులు, తల్లి తండ్రులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సనాతన సంస్కృతికి బ్రాహ్మణులు మూల స్తంభాలు : దగుమాటి

కావలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులు భారతీయ సనాతన సంస్కృతికి మూల స్తంభాలని, వారు త్రికరణశుద్ధిగా నిర్వహించే హోమాలు సమాజానికి సకల శుభాలను కలిగిస్తాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ముసునూరు అయ్యప్ప స్వామి ఆలయంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీకవన సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. స్వామి కృపా కటాక్షలతో ప్రజలందరికీ శాంతి, ఆనందం కలగాలని ఆకాంక్షించారు. బ్రాహ్మణులు పాటించే పవిత్ర సంప్రదాయాలు తనకు ఎంతో ఇష్టమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు పాల్గొన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

ఎమ్మెల్యేని కలిసిన ఏఈ కిరణ్

మొంథా తుపాన్ ముందస్తు చర్యలు చేపట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అమరావతిలో మొంథా తుఫాన్ సైక్లోన్ ఫైటర్ అవార్డు అందుకున్న కావలి జల వనరులశాఖ ఏఈ జంపాని కిరణ్ ఆదివారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏఈని అభినందించారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కావలి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఆనెమడుగు సాగునీటి సంఘం అధ్యక్షుడు బొమ్మిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం ఆనెమడుగులో శ్రీనివాసులు రెడ్డి, సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సూచనల మేరకు గిరిజనులకు దుప్పట్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఆనెమడుగు పంచాయతీ అధికారి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న స్థానిక నాయకులు

బోగోలులో వైభవంగా 'ఆల్ సోల్స్' ఫెస్టివల్

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రంలో క్రైస్తవ సమాధుల తోటలో ఆదివారం సాయంత్రం ఆల్‌సోల్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యుల సమాధులను అందంగా అలంకరించుకుని క్రైస్తవ సంఘ కాపరులచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన క్రైస్తవ సమాధుల తోట కావడంతో ఆంగ్లోఇండియన్ల సమాధులను దర్శించుకునేందుకు చెన్నై, తెలంగాణ ప్రాంతవాసులు వచ్చారు. సమాధుల వద్ద క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు. పేదలకు భోజనం, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జే ఐజేక్, శ్యాంసన్‌బాబు, ఎబినేజర్, పౌలు, జార్జీ, దేవదానం, సామ్యేల్, యేసు రత్నం, అనిల్ జ్యోషి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


పూలతో అలంకరించిన పెద్దల సమాధులు


కేజ్ వీల్స్‌తో రహదారులు ధ్వంసం

ఉదయగిరి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేజ్ వీల్స్‌తో రహదారులు ధ్వంసం అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని వాహనదారులు విమర్శిస్తున్నారు. రైతులు పొలాలను సాగు చేసుకొనే క్రమంలో ముందస్తుగా కేజ్ వీల్స్‌తో దుక్కి చేస్తుంటారు. ఈ నేపథ్యంలో కొంతమంది ట్రాక్టర్ల యజమానులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ నివాసాల వద్దే వాటిని అమర్చుకొని ప్రధాన రహదారుల మీద పొలాలకు వెళ్తుండడం గమనార్హం. దీంతో ఇనుప చక్రాల బరువుకు తారురోడ్లు దారి పొడవునా పెచ్చులూడి గుంతలు పడడంతో పాటు ఛిద్రం అవుతున్నాయి. దీంతో ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గండిపాళెం, గుడినరవ, సున్నంవారిచింతల, మాసాయిపేట గ్రామాలతో పాటు వరికుంటపాడు మండలం జీ.కొండారెడ్డిపల్లి, ఇస్కపల్లి, యర్రంరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి దాపురించడంతో పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రివేళ, వర్షాలు కురిసిన సమయంలో వాహనదారుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


గండిపాళెంలో అధ్వానంగా మారిన రహదారి

ఆదమరిస్తే అంతే సంగతులు ..

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు బోయమడగల బస్టాండ్ సెంటర్ సమీపంలోని మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆ రహదారి సమీపంలోనే నివాసాలు ఉండడంతో పాటు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్ల పుణ్యమాని ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆ మలుపు వద్ద ఒకరు మృత్యువాత పడడంతో పాటు పలువురు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఆ మార్గంలో ప్రతినిత్యం ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో ఏసమయంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. కనీసం స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ప్రమాదకరంగా మారిన మలుపు

వర్షాలకు ఒరిగిన విద్యుత్ స్తంభం

ఉదయగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్టేట్‌పేట ప్రాంతంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ విద్యుత్ స్తంభం ఒరిగి కూలేదశలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా స్తంభం ఒరిగిపోయిందని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



ఇంకుడు గుంత నిర్మించండి సారూ..

అనంతసాగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన కాలనీలో ఏర్పాటు చేసిన చేతిపంపు వద్ద ఇంకుడు గుంత లేక వ్యర్థనీరుతో బురదగా మారి దుర్గంధం వెదజల్లుతోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇంకుడు గుంత నిర్మించి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.

చేనేతలకు నష్ట పరిహారం అందచేయాలి

● చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన జిల్లాలోని చేనేత కార్మికులకు నష్టపరిహారంతో పాటు పనులు కోల్పోయిన ప్రతి కుటుంబానికి రూ. 20 వేల ఆర్థికసాయం అందచేయాలని జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మండల కేంద్రంలోని సాయినగర్, రాళ్లచెలిక, కొత్తూరు, శ్రీనివాస పురం, తిరుమనతిప్ప చేనేతలు నివసిస్తున్న కాలనీల్లో పర్యటించారు. మగ్గం గుంతల్లోకి వచ్చిన నీటిని, దెబ్బతిన్న పడుగు, నూలు, చీరలను పరిశీలించి చేనేతలతో మాట్లాడారు. అనంతరం నేతన్నల దుస్థితిని ఫోన్‌లో ఏడీకి వివరించారు. ఈసందర్భంగా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ మాట్లాడుతూ భారీ వర్షాలకు చేనేతల మగ్గం గుంతల్లోకి నీరు రావడంతో 10 రోజులుగా పనులు లేవని, మరో 15 రోజులైనా గుంతల్లో ఊట తగ్గే పరిస్థితి లేదన్నారు. నష్టపరిహారంతోపాటు పనులు కోల్పోయిన ప్రతి కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సాయం అందచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతన్నలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆమేరకు త్వరలో చేనేత జౌళి శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమా గోపాల్, ఉపాధ్యక్షుడు జానపాటి రామసుబ్బయ్య, జిల్లా కార్యదర్శి బండి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యుడు బోడిచర్ల రవి, స్థానిక చేనేత కార్మికులు పాల్గొన్నారు.


మగ్గం గుంటను పరిశీలిస్తున్న చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

ఈ-పంట నమోదుకు గడువు పెంపు

ఉదయగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదుకు ఈనెల 8వతేదీ వరకు గడువు పెంచినట్లు ఉదయగిరి వ్యవ సాయ సహాయ సంచాలకుడు పార్లపల్లి చెన్నారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ-పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దివంగత రాష్ట్ర మంత్రి గౌతమ్‌రెడ్డికి ఘన నివాళి

ఆత్మకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆదివారం మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైసీపీ పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

●సంగం : దివంగత మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని మండలంలో వైసీపీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బ్యారేజీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

రైతులకు యూరియా పంపిణీ

ఉలవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఇబ్బంది పడకుండా కూటమి ప్రభుత్వం యూరియా సరఫరా చేసిందని మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ ఆదివారం తెలిపారు. కరేడులోని ఆర్ఎస్‌కే-1 పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల పరిధిలో మొత్తం 140 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు, మరో ఆర్ఎస్‌కేకు 20 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన సబ్సిడీ మేరకు రైతులకు 45 కిలోల యూరియా బస్తా రూ.267కే అందిస్తామన్నారు. అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాలలో ఆన్‌లైన్ పేరు నమోదు చేయించుకొని యూరియా పొందవచ్చన్నారు.


కరేడు ఆర్ఎస్‌కే నుంచి యూరియా కొనుగోలు చేసిన రైతులు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామానికి సోమవారం ప్రముఖ రాజకీయ నాయకులు వస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సౌజన్యంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించడం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఉదయగిరి, కోవూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొంటారన్నారు.

నవవధువుకు ఆర్థిక సాయం

వింజమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మరాజుచెరువు గ్రామం ఎస్సీ కాలనీలో ఆత్మకూరి కొండయ్య, లక్ష్మమ్మ దంపతుల కుమార్తె మాధవి వివాహం సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కాకర్ల ట్రస్ట్ తరపున పెళ్లి కానుకగా రూ.10వేలు స్థానిక నాయకులు ఆదివారం అందించారు. కార్యక్రమంలో వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత


ఉలవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భీమవరంలోని 33కేవీ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న క్రమంలో మన్నేటికోట 133 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మండలంలోని అన్ని సబ్‌స్టేషన్‌లకు సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

శివ కుటుంబార్చన కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శివభక్త మండలి సభ్యులు

కలువాయి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివభక్త మండలి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నిర్వహించతలపెట్టిన శివ కుటుంబార్చన కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. స్వామివారికి అభిషేకం, గణపతి పూజ, 5 నదుల గంగా జలాలతో సామూహిక రుద్రాభిషేకం, విబూది, చందనం, మారేడు దళాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సతీసమేత వీరబ్రహ్మేంద్రస్వామి

ఆత్మకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జయంతి వేడుకలను నిర్వహించారు. స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, మంగళతోరణం, అభిషేకం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ గావించారు.

లలితా రుద్ర మహాయజ్ఞం

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండపైన ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో లలితా రుద్ర మహాయజ్ఞం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూజలు నిర్వహించారు.



● మాడవీధుల్లో ఊరేగిన ఉగ్రశ్రీనివాసమూర్తి

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ఆదివారం కైశిక ద్వాదశి ఆస్థానం వైభవంగా జరిగింది. వేకువజామున 4.30 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు బంగారు వాకిలి చెంత అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని నిర్వహించారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తి ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధుల్లో ఊరేగుతారు. శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు ఈ వాహనసేవలో పాల్గొన్నారు. భక్తులందరికీ స్వామి కృపాకటాక్షాలు కలగాలని ప్రార్థించినట్టు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ చెప్పారు.

'హిమ' నగరం



తిరుపతి నగరాన్ని ఆదివారం పొగమంచు దట్టంగా కమ్మేసింది. ఉదయం 10గంటల వరకు మంచు సోయగం ఆహ్లాదపరిచింది. చలి పెరగడంతో వృద్ధులు, చంటి బిడ్డలు వణికిపోయారు. ఇక, మొదటి ఘాట్‌లో తిరుపతికి దిగే భక్తులు ప్రకృతి రమణీయ దృశ్యాలను వీక్షించారు. పదిగంటల తర్వాత పొగమంచు వీడిపోయి ఎండ చురుగ్గా వచ్చింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



ఆదివారం సాయంత్రం 5.26 గంటలు. శనివారం సాయంత్రం మొదలైన కౌంట్ డౌన్ '0'కు చేరింది. అంతే.. ఒక్కసారిగా నిప్పులు చిమ్ముతూ భారీ ఉపగ్రహాన్ని తీసుకుని బాహుబలి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. కోట్లాది మంది భారతీయుల కలలను సాకారం చేస్తూ.. శాస్త్రవేత్తల శ్రమకు ప్రతిఫలమిస్తూ సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. దీంతో ఒక్కసారిగా షార్‌లో చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దేశమంతా సంబరం చేసుకుంది. దీనికి సతీష్ థావన్ స్పేస్ సెంటర్ (షార్) వేదికైంది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఎల్వీఎం3-ఎం5 రాకెట్.. 4,410 కిలోల అతి పెద్దదైన సీఎంఎస్-03 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని మోసుకుంటూ రోదసిలోకి వెళ్లింది. మూడు దశలను విజయవంతంగా పర్తి చేసుకుని నిర్ణీత 16.29 నిమిషాల్లో ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చింది. ఈ ప్రయోగం విజయవంతమైనట్లు మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఇస్రో చైర్మన్ నారాయణన్ ప్రకటించడంతో సంబరాలు మిన్నంటాయి.తొలి ప్రయత్నంలోనే భారీ ప్రయోగం విజయవం తం కావడంతో దేశమంతా హర్షాతిరేకా లు వ్యక్తమయ్యాయి.ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు గ్యాలరీకి మధ్నాహ్నమే భారీగా సందర్శకులు చేరుకున్నారు. ఆదివారం కావవడంతో సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు అధికంగా విచ్చేశారు. రాకెట్ నింగిలోకి ఎగిరే సమయంలో గ్యాలరీలో ఉన్న వీక్షకులు చప్పట్లు, కేరింతలు కొడుతూ ఉత్సాహంతో తిలకించారు.



వీక్షిస్తున్న ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు

ఎల్వీఎం3 వరుస విజయాలు..

బరువైన ఉపగ్రహాలను నింగిలోకి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ఎల్వీఎం3 రాకెట్లను రూపొందించారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో క్రయోజనిక్ దశను సైతం అభివృద్ధి చేసి విజయవంతంగా ప్రయోగించారు.

● 2010లో ఎల్వీఎం3 రాకెట్లకు పునాది వేయగా తొలిసారిగా 2014 డిసెంబరు 18న ఎల్వీఎం3 కేర్ మిషన్‌ను ప్రయోగించి తొలి ప్రయత్నంలో విజయం సాధించారు.అప్పటి నుంచి భారీ ఉపగ్రహాలను ఈ రాకెట్ ద్వారా పంపేందుకు శ్రీకారం చుట్టారు.

● 2017 జూన్ 5న ఎల్వీఎం3-డీ1 ద్వారా జీశాట్-19 ఉపగ్రహాన్ని విజయవంతం పంపారు. అప్పట్నుంచి భారీ ఉపగ్రహాలను విజయవంతంగా మోసుకెళ్లే ఈ రాకెట్.. బాహుబలిగా పేరొందింది.

● 2018 నవంబరు 14న జీశాట్-29, 2019 జూలై 22న ఎల్వీఎం3-ఎం1ద్వారా చంద్రయాన్-2, 20 22 అక్టోబరు 22 ఎల్వీఎం3-ఎం2 వన్‌వెబ్-1,2023 మార్చి 23ఎల్వీఎం3- ఎం3 ద్వారా వన్‌వెబ్-2, 2023 జూలై 14 ఎల్వీఎం3-ఎ4 ద్వారా చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించి చరిత్ర సృష్టించారు.

● తాజాగా ఎనిమిదో ప్రయోగం ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా కమ్యూనికేషన్ రంగానికి చెందిన సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో చరిత్రలో మరో కలికితురాయిగా నిలిచింది. వరుసగా 8 ప్రయోగాలతో మన శాస్త్రవేత్తలు సత్తా చాటారు.



గ్యాలరీలో నుంచి తిలకిస్తున్న వీక్షకులు

శ్రీకారి ఆశీస్సుల కోసం..



వివాహానంతరం శ్రీవారి ఆశీస్సులు పొందడానికి సినీ హీరో నారా రోహిత్, శిరీష దంపతులు తిరుమలకు వచ్చారు. ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల రోహిత్ దంపతులను పలువురు అభిమానులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



● కార్తీక సోమవారం

నేడు శివాలయాలు, పుణ్య స్నానాలకు

పోటెత్తనున్న భక్తజనం

● ఆలయాలు, జలపాతాలు, బీచ్‌ల వద్ద భద్రత తప్పనిసరి

● భక్తులూ స్వీయనియంత్రణ పాటించాలి

తిరుపతి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం.. జిల్లావ్యాప్తంగా శివాలయాల సందర్శనకు, పుణ్యస్నానాల కోసం జలపాతాలకు, సముద్ర తీరానికి భక్తుల రాక పెరగనుంది. ఈ ఏడాది ప్రారంభంలో తిరుపతిలోనూ, గత శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోనూ జరిగిన తొక్కిసలాట ఘటనల నేపథ్యంలో ఆలయాలు, జలపాతాలు, బీచ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన అవసరం కనిపిస్తోంది. అదే సమయంలో భక్తులు కూడా స్వీయ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం కలిగిన శివాలయాలు అనేకం వున్నాయి. శ్రీకాళహస్తికి దక్షిణ కాశిగా పేరు. ఏర్పేడు మండలం గుడిమల్లంలో క్రీస్తుపూర్వం నాటి పరశురామేశ్వరాలయం వుంది. నాగలాపురం మండలం సురుటిపల్లిలో పౌరాణి ప్రశస్తి కలిగిన పల్లికొండేశ్వరాలయ ఖ్యాతి తెలియంది కాదు. తిరుపతిలో కపిలేశ్వరస్వామి ఆలయం.. కపిలతీర్థం జలపాతం గురించి చెప్పాల్సిన పనిలేదు. శివాలయాలతో కూడిన జలపాతాలకు కొదువ లేదు. తలకోన సిద్దేశ్వరస్వామి ఆలయం, ఝరిగా పేరొందిన జలపాతం తెలియని వారుండరు. కైలాసకోన, సదాశివకోన, మూలకోన వంటి చోట్ల శివాలయాలతో పాటు జలపాతాలున్నాయి. ఉబ్బలమడుగు, మామండూరు వంటి జలపాతాలతో పాటు తూపిలిపాలెం, శ్రీనివాసనత్రం వంటి బీచ్‌లు జిల్లాలో వున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలపాతాలు ఉద్ధృతిగా ఉన్నాయి. స్వర్ణముఖితో పాటు పలు వాగులు, తెలుగు గంగ కాలువలు ఇప్పటికీ ఒకింత ప్రమాదకరంగానే ప్రవహిస్తున్నాయి. కార్తీక సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఆలయాలకు, జలపాతాలకు, బీచ్‌లకు వెళ్ళే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆయా పరిధిలోని రెవెన్యూ, పోలీసు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాల్సిన అవసరముంది. భక్తులకూ అవగాహన కల్పించాలి.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందన

తడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్, షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్, ఇతర శాస్త్రవేత్తలను అభినందిస్తున్నామని వారు పేర్కొన్నారు.



రాకెట్ ప్రయోగం నేపథ్యంలో షార్ మొదటి గేటు వద్ద పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది బందోబస్తు

నిండుగా పులికాట్

పులికాట్ సరస్సు జలకళ సంతరించుకుంది ఇటీవల వర్షాలకు భారీగా వరదనీరు చేరింది. దీంతో సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డు మార్గంలో, వేనాడు, కొరిడి-పేర్నాడు మార్గాలో సరస్సు నిండుకుండను తలపిస్తోంది. ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల్లో 620 చదరపు కీలో మీటర్ల విస్తరించి ఉన్న పులికాట్‌లో ఇటు సముద్రం నుంచి ఉప్పునీరు, నదుల నుంచి మంచినీరు కలవడంతో అపార మత్స్య సంపదకు నిలయంగా పేరుగాంచింది. భారీగా నీరు చేరడంతో ఇక్కడ పక్షులు సందడి చేస్తున్నాయి.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి





సరస్సులో పక్షుల సందడి

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని విద్యుత్ సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను ఫోనుద్వారా తెలిపి పరిష్కరించుకోవడానికి ఇదో మంచి వేదికన్నారు. సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 89777 16661 నెంబరుకు ఫిర్యాదు చేస్తే తాను విని పరిష్కరించడానికి వీలవుతుందన్నారు. అలాగే 91333 31912 నెంబరుకు చాట్ చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని సూచించారు.



హలో.. నేను వెంకటేశ్వర్లుడ్ని

ముగిసిన బాలోత్సవం

మట్టితో విభిన్న ఆకృతులతో బొమ్మలను ఆవిష్కరించారు. అబ్బురపరిచే దృశ్యాలను గీశారు. దేశభక్తి పాటలు పాడారు. వివిధ అంశాలపై ఉపన్యాసాలిచ్చారు. కోలాటాలాడారు. నృత్య ప్రదర్శనలతో అలరించారు. చెవులకు ఇంపుగా శాస్త్రీయ సంగీతం వినిపించారు. జానపద గీతాలతో హుషారెత్తించారు. యోగా విన్యాసాలతో అబ్బురపరిచారు. ఇలా రెండు రోజులపాటు తిరుపతిలో సాగిన బాలోత్సవం ఆదివారం ముగిసింది. రెండో రోజున 18 అంశాల్లో వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో ఆరు సాంస్కృతిక వేదికల్లో నృత్యప్రదర్శనలు, జానపద కళాప్రదర్శలు జరిగాయి. ఈ రెండు రోజులపాటు విద్యార్థులు సరదాగా గడిపారు. కొన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు రాగా.. మరికొందరు తమ తల్లిదండ్రులతో కలిసి పోటీలను వీక్షిస్తూ ఆనందంగా గడిపారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి





ఏర్పేడు నుంచి పూడికి రైలు మార్గం

● యుద్ధప్రాతిపదికన సర్వే పనులు

● మండలంలో 151.03 ఎకరాల సేకరణ

ఏర్పేడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు రైల్వేస్టేషన్ నుంచి వడమాల పేట సమీపంలోని పూడికి రైలు మార్గం ఏర్పాటు కానుంది. ఇటు చెన్నైకి, అటు గుంతకల్లుకు వెళ్లడానికి రెండు మార్గాలను కలుపుతూ ఈ మార్గం ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు సిద్ధమైంది. వెంకటాపురం, ఇసుకతాగేలి, పాతవీరాపురం, మాధవమాల, కోబాక, ఎండీ పుత్తూరు, మునగలపాళెం, వెదళ్లచెరువు, చెల్లూరు, గుడిమల్లం గ్రామాల మీదుగా పూడికి రైలు మార్గం వేయనన్నారు. ఆయా గ్రామాల్లో తహసీల్దారు భార్గవి ఆధ్వర్యంలో 20 రోజులుగా సర్వే చేస్తున్నారు. రైలు మార్గానికి భూములు కోల్పోతున్న రైతులతో త్వరలో సమావేశం కానున్నారు. కాగా, సర్వే రిపోర్టు ప్రకారం రైతులకు పరిహారం అందించేందుకు వీలుగా సబ్ రిజిస్ట్రార్‌కు వాల్యూ వేయాలని తహసీల్దార్ ప్రతిపాదనలు పంపారు. ఇసుక తాగేలిలో 22.45ఎకరాలు, పాతవీరాపురంలో 19.37, మాధవమాలలో 2.79, మునగలపాళెంలో 4.43, కోబాకలో 7.49, ఎండీపుత్తూరులో 20.69, చెల్లూరులో 35.84, వెదళ్ల చెరువులో 12.64, గుడిమల్లంలో 24.92 ఎకరాల చొప్పున ఈ రైలు మార్గానికి అవసరం కానుంది.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



కొత్త ఫ్లోరింగ్ వద్ద పూర్వ విద్యార్థులు, చంద్రమౌళి

సూళ్లూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటునందించారు. కోటపోలూరు హైస్కూల్‌లో 1990 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రూ.7.50 లక్షలతో పాఠశాల ఆవరణలో ఫ్లోరింగ్‌పాటుతో పాటు పలు అభివృద్ధి పనులు చేశారు. ఇందుకు వారంతా సొంత నిధులు వెచ్చించారు. ఆదివారం పూర్వపు విద్యార్థులు తాటిపర్తి శేఖర్ కాశిబట్టల బాలకృష్ణ, రమణయ్యలు ఈపనులను ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి చేయూతనిచ్చిన పూర్వపు విద్యార్థులను ఎంపీడీవో మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి అభినందించారు. పూర్వపు విద్యార్థులు ఉన్నారు.

శివాలయాల వద్ద భద్రత: సీఐ



మురళీకృష్ణ

తడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా ఆలయాల వద్ద గట్టి భద్రతను ఏర్పాటు చేస్తామని సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండో సోమవారం, అలాగే బుధవారం కార్తీక పౌర్ణమి నేపథ్యంలో శివాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారన్నారు. తడ భువనేశ్వరస్వామి ఆలయం, సూళ్లూరుపేట నాగేశ్వరస్వామి ఆలయాల వద్ద ప్రత్యేకంగా పోలీసులను నియమించామన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా భద్రత చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

సెంట్రల్ లైటింగ్ పనుల పరిశీలన



సెంట్రల్‌లైటింగ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివేకానందరోడ్డులో మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.75లక్షలకు పైగా నిధులతో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివేకానందరోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌సెంటర్, ముత్యాలపేట, ఆసుపత్రిరోడ్డు, ఆర్టీసీ బస్టాండు రోడ్లు మీదుగా పోటుపాళెం జాతీయరహదారి కూడలి వరకు ఈ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే చెరువు కట్టను ఆధునీకరిస్తామన్నారు. కట్టపై పార్కు, వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, వేముల సునీల్, పార్వతయ్య, బిల్లు చెంచురామయ్య, ప్రణీత్ పాల్గొన్నారు.

క్రికెట్ ఫైనల్ కోసం భారీ స్క్రీన్ ఏర్పాటు



మ్యాచ్‌ను వీక్షిస్తున్న నెలవల, తదితరులు

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రపంచ కప్ వీక్షించేందుకు వీలుగా స్థానిక ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఆదివారం భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. పలువురు ఈస్క్రీన్ మీద మ్యాచ్‌ను వీక్షించారు. **నాయుడుపేట టౌన్:** నాయుడుపేట గాంధీమందిరం సెంటర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, అవధానం సుధీర్, అంకయ్య, సుజాతమ్మ, ముత్యాలయ్య, మస్తాన్, చెంచయ్య మ్యాచ్ వీక్షించారు.

వాషింగ్ పౌడర్ తయారీపై శిక్షణ



మహిళలకు శిక్షణ ఇస్తున్న సంస్థ ప్రతినిధి సులక్ష్మి

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే తమ సంస్థ లక్ష్యమని సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక సునీతసేవాసంస్థ కార్యాలయంలో సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వాషింగ్ పౌండర్ తయారీపై శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తమ సంస్థ మహిళలకు పలు వృత్తి విద్యాకోర్సులలో శిక్షణ అందిస్తోందని వివరించారు.

స్వర్ణముఖినది ప్రాంతంలో పారిశుధ్య చర్యలు



పనులను పర్యవేక్షిస్తున్న ఫజులుల్లా

నాయుడుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా ప్రసూనాంబ నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం, స్వర్ణముఖినది పరివాహక ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. మహిళలు సోమవారం నదిలో దీపాలతో పూజలు చేస్తారు. భక్తులు నదిలో స్నానాలు కూడా చేస్తారు. ఈక్రమంలోనే పరిసరాలను శుభ్రంగా చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు



సంతకాల సేకరణలో సంజీవయ్య

నాయుడుపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ చేయడం వల్ల పేద విద్యార్థులకు వైద్యం, విద్య దూరం అవుతారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. ఇందుకు నిరసనగా ఒద్దిగుంటకండ్రిగలో సంతకాల సేకరణను చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, విజయ డైరీ డైరెక్టర్ కట్టా భవానీరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, రూరల్ అధ్యక్షుడు ఒత్తూరు సురేష్‌యాదవ్, ఎంపీపీ ధనలక్ష్మి, రత్నశ్రీ, తదితరులు ఉన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు సన్మానం



వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బాలిరెడ్డిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన ఐదుగురు ఉపాధ్యాయులను సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి మాట్లాడుతూ. సమాజాన్ని తీర్చిదిద్దే గురుతరబాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే అరుదైన అవకాశం ఉపాధ్యాయులదే అన్నారు. కార్యక్రమంలో కొడవలూరు ఐరీష్‌రెడ్డి, శివకుమార్, వంశీ శేఖర్ తదితరులు ఉన్నారు.

మృతదేహం అప్పగింత

పెళ్లకూరు, నవంబరు, 2 (ఆంధ్రజ్యోతి) : నందిమాల దళితవాడలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గంధం వీరాస్వామి (22) మృతదేహానికి పంచనామా నిర్వహించారు. ఆదివారం బాధిత కుటుసభ్యులకు మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



గూడూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):కార్తీకమాసం సందర్భంగా రెండో పట్టణ పరిధిలోని బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య కల్యాణమండపంలో ఆదివారం రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం వనభోజనాలను ఏర్పాటు చేశారు. ఆనిమేళ్ల శివకుమార్, శిరోమణిశర్మ, రామ్మూర్తి, ఉద్యాలలిత, శ్రీనివాసరావు, పురుషోత్తమరావు పాల్గొన్నారు.

రిటైర్డ్ అధ్యాపకుడికి సత్కారం



వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గురుకుల కళాశాలో రిటైరైన తెలుగు అధ్యాపకుడు కోడూరు రాజశేఖర్‌ను పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వపువిద్యార్థులు మాట్లాడుతూ 37 ఏళ్లగా అధ్యాపకుడిగా రాజశేఖర్ ఎనలేని సేవలు అందించారన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పద్మజ, కంటేపల్లి వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతి



వెంకటరత్నం

చిట్టమూరు, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి : తాడిమేడు పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పల్లం వెంకటరత్నం(59) శనివారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతి చెందారు. చాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు తిరుపతి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణం విడిచారు. వెంకటరత్నం టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు.

దాడి ఘటనలో ఒకరికి గాయాలు

తడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో జరిగిన దాడిలో ఒకరికి గాయాలు అయ్యాయి. స్థానిక బోడిలింగాలపాడుకు చెందిన చిలమత్తూరు చల్లయ్యకు బంధువు దినేష్ కుటుంబాల మధ్య చిన్నపాటి గొడవలు ఉన్నాయి. శనివారం ఈ క్రమంలో దినేష్ అతని సోదరుడు అభిషేక్, మరో ముగ్గురు కలసి చల్లయ్య కుటుంబంతో గొడవకు దిగారు. చల్లయ్య కుమారుడు లోకేష్‌పై దాడిచేసి కొట్టారు. లోకేష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. దినేష్, అభిషేక్‌లు వెంబడించి అక్కడ కూడా దాడిచేశారు. దీంతో సృహ తప్పిన లోకేష్‌ను వెంటనే చెన్నై తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో గృహ సముదాయం వద్ద కార్డన్ సెర్చ్



వెంకటగిరి టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక టిడ్కో ఇళ్ల వద్ద పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఏవీ రమణ మాట్లాడుతూ పట్టణంలో అనుమానితులను గుర్తిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్డన్ సెర్చ్‌లో 16మోటర్ సైకిళ్లు, 3ఆటోలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ ఏడుకొండలు, శివశంకర్, గోపీ, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడు అంకయ్యకు పరామర్శ



అంకయ్యను పరామర్శిస్తున్న నెలవల

ఓజిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న కురుగొండ సొసైటీ అధ్యక్షుడు దారా అంకయ్యను నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి నెలవల పరామర్శించారు. ఇటీవల అంకయ్య గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఆదివారం గ్రామానికి వచ్చారు. నెలవల వెళ్లి అంకయ్యను పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆయన వెంట గ్రామ నాయకులు శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, కృష్ణయ్య, మాధవయ్య, గోవిందయ్య, అంకయ్య తదితరులున్నారు.

కారు,ట్రాక్టర్ ఢీ : ఒకరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యానగర్ బాలభారతీ విద్యాసంస్థల సమీపంలో ఆదివారం ఇసుక ట్రాక్టర్ కారును ఢీకొంది. ఒంగోలుకు చెందిన కారు చిట్టమూరు నుంచి విద్యానగర్ మీదుగా గూడూరుకు వెళ్తోంది. తిన్నెలపూడికి చెందిన ఇసుక లోడ్ ట్రాక్టర్ కోట వైపు వెళ్తుంది. ఈ రెండూ బాలభారతీ విద్యాసంస్థల సమీపంలో ఢీకొన్నాయి.దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జుఅయ్యింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు వెళ్లి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

నరకంగా మారిన ప్రయాణం

అధ్వానంగా కొరిడి-పేర్నాడు రోడ్డు



గోతులమయంగా కొరిడి-పేర్నాడు రోడ్డు



కోతకు గురికావడంతో రక్షణగా వేసిన ఇసుకబస్తాలు

సూళ్లూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి కొరిడి-పేర్నాడు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డులో ఇటీవల వర్షాలకు నీరు నిలబడి ఇబ్బందికరంగా మారింది. శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అట్టకానితిప్ప నుంచి కడపత్ర వరకు దాదాపు 9 కిలో మీటర్ల మేర పులికాట్ సరస్సు మధ్యలో కొరిడి-పేర్నాడుకు గ్రావెల్ రోడ్డు మార్గం ఉంది. పులికాట్ తీర ప్రాంతాల్లో దాదాపు 3 పంచాయతీలు చేరి 23 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామ ప్రజలు పనుల నిమిత్తం సూళ్లూరుపేటకు ఈ రోడ్డు గుండా రావాలి. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం తట్టెడు మట్టి కూడా వేసిన పాపాన పోలేదు. దీంతో గ్రావెల్ రోడ్డు కూడా గోతులమయంగా మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తారురోడ్డుగా మార్చేందుకు అసెంబ్లీలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రెండు సార్లు ప్రస్తావించారు. సీఎం దృష్టికి సైతం తీసుకెళ్లి తారురోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని డిప్యూటీ సీఎం ను విన్నవించారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. పులికాట్ నీటి ఉధృతితో రోడ్డుకు గండ్లుపడింది. కోతకు గురవుతోంది. గ్రామస్తులు గండ్ల వద్ద ఇసుక బస్తాలను రక్షణగా వేసుకున్నారు. బస్సు సైతం అతి కష్టం మీద నడుస్తోంది. గుంతలు పూడ్చి మరమ్మతులెనా చేపట్టాలని కోరుతున్నారు.

అటు కుక్కలు..ఇటు పశువుల తిష్ఠ





సంఘం థియేటర్ సెంటర్- రాజావీధిలో వీధికుక్కలు



టవర్‌క్లాక్ సెంటర్ వద్ద పశువులు

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోవీధికుక్కలు హడలెత్తిస్తున్నాయి. కొన్ని వీధుల్లో తిరగాలంటేనే భయంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపాలంటే భయంగా ఉందంటున్నారు. స్టేడియంకు వాకింగ్‌కు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల్లో వెళ్తున్నా వెంట తరుముతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా పాతబస్టాండు, టవర్‌క్లాక్‌సెంటర్, ఐసీఎస్‌రోడ్డు, మసీదువీధి, అశోక్‌నగర్, మాళవ్యానగర్, గాంధీనగర్, చర్చివీధి, సంఘంథియేటర్ సెంటర్, కుమ్మరవీధి, రాజావీధి ప్రాంతాల్లో వీటి బెడద ఎక్కువగా ఉంది. నాలుగేళ్లకు పైగా వీధికుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి దాడులకు తెగబడుతున్నాయి. దీనికి రాత్రిసమయంలో పశువుల సంచారం అధికంగా ఉంటోంది. బహిరంగంగా వదిలేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని మూడు రోజులుగా మున్సిపల్ అధికారులు ప్రచారం కూడా నిర్వహిస్తున్నారు. పశువులతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. మున్సిపల్ అధికారులు వీధికుక్కల సంచారాన్ని నివారించాలని, పశువుల యజమానులను హెచ్చరించాలని కోరుతున్నారు.

అలరించిన ట్రైబల్ డ్యాన్స్ ఫెస్టివల్



నాయుడుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సాంస్కృతికశాఖ, రైట్స్ తిరుపతి సంయుక్తంగా నాయుడుపేటలో ఆదివారం ట్రైబల్ డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. స్థానిక పెద్దదర్గా ఆవరణలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ దేవానంద్ ఆధ్వర్యంలో యువతీయువకులుశాస్త్రీయ నృత్యాలు, జానపద కళారూపాలను ప్రదర్శించారు. సంప్రదాయాలు,సంస్కృతిలపై యువతకు అవగాహన కల్పించడం కోసం ఈ ప్రదర్శనను నిర్వహించారు. సంగీతం, నృత్యాలు, .నాటక కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నారావారిపల్లెకు రోహిత్ దంపతులు



రామ్మూర్తినాయుడి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న రోహిత్ దంపతులు

చంద్రగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత నారా రామ్మూర్తినాయుడి కుమారుడు రోహిత్, శిరీష దంపతులు స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెకు ఆదివారం విచ్చేశారు. తల్లి ఇందిరతో పాటు గ్రామస్తులు, బంధువులతో కలిసి రోహిత్, ఆయన సతీమణి శిరీష నాగాలమ్మ, గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ్మూర్తినాయుడు, తాత, అవ్వలు ఖర్జురపునాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు.. అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతకుముందు శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో రోహిత్ దంపతులకు స్వాగతం పలికారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్‌యాదవ్ వీరికి శాలువా కప్పి జ్ఞాపిక మోమెంటో అందజేశారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించారు. అమ్మవారిని దర్శించుకున్నారు. త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నవావరణ హోమపూజలు



గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయి సత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నవావరణ హోమపూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశిష్టపూజలు జరిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ

బాలాయపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కోటి సంతకాలతో కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పి కొడదామని వైసీపీ మహిళా విభాగం నియోజకవర్గం అధ్యక్షురాలు కాటూరు రామ తులసి అన్నారు. ఆదివారం జయంపులో కోటి సంతకాల సేకరణ వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వలన వైద్య విద్య భారంగా మారి పేదల పిల్లలు వైద్య విద్యకు దూరం అవుతారన్నారు. ప్రసాద్ రెడ్డి, మాస్తాన్, సుకుమార్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. పండితులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసింది

మంచి పౌరుల కొరత తీర్చడమే బాలోత్సవం లక్ష్యం





అలరించిన కోలాటం- విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

తిరుపతి(కల్చరల్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'మన దేశంలో మంచి పౌరుల కొరత వెంటాడుతోంది. దీనిని తీర్చడానికి బాలోత్సవం ఎంతగానో ఉపకరిస్తుంది' అని పలువురు అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన బాలోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సమావేశంలో ప్రముఖ సాహితీవేత్త సాకం నాగరాజు, గార్లపాటి దామోదరం, బీఎస్ రెడ్డి, మణికంఠ, మబ్బు సూర్యనారాయణరెడ్డి, కేవీచౌదరి, ఏనుగుల అంకమనాయుడు, అనంతశయనం, హేమచంద్ర తదితరులు ప్రసంగించారు. ఈ సారి బాలోత్సవంలో 11వేల మందికిపైగా బాలబాలికలు పాల్గొన్నారన్నారు. వివిధ అంశాల్లో జరిగిన పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారని చెప్పారు. నిత్యం చదువుల ఒత్తిడిలో ఉండే పిల్లలకు ఈ బాలోత్సవం ఆటవిడుపుగా పేర్కొన్నారు. తమ ప్రతిభతో తొలిమూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, రెడ్డెప్ప, గురునాథం, మునిలక్ష్మి, మన్నవ గంగాధరప్రసాద్, నెమిలేటి కిట్టన్న, ప్రసాద్, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, గోవిందయ్య, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.



బొమ్మలు గీస్తున్న చిన్నారులు









ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు